# పురుషోత్తముడు

—జంధ్యం వెంకటేశ్ బాబు

గోధూళివేళ ఇంటికి తిరిగొస్తున్న తెల్ల ఆవులా ఊళ్లోకి ప్రవేశిస్తున్న ఆ మారుతి కారుని గ్రామస్తులు తదేకంగా చూడసాగారు.

కారు ఊరు మధ్యకు వచ్చింది. దేవాలయం ముందు కారాపిన ఆ వ్యక్తి ముఖం బయటకు పెట్టి కారువంకే చూస్తున్న గ్రామస్తుడ్ని ప్రశ్నించాడు. 'డాక్టర్ రమేష్ ఇల్లెక్కడ?'

'ఈ దారమ్మటే ఊరు చివరకెళ్లండి. అక్కడ చెరువుగట్టున అందంగా కనిపించే ఇల్లే ఆ బాబుగారిది. ఆసుపత్రి కూడాఅదే'

కారు ముందుకు సాగింది.

మట్టిరోడ్డు మీద మరో అర్ధ కిలోమీటరు వెళ్లాక కనిపించిందా ఇల్లు.

చుట్టూ ఐరన్ ఫెన్సింగ్, అందులో రకరకాల పూల మొక్కలు, సన్నటి బాటకిరుపక్కలా కనిపించే అందమైన లాన్... ఫెన్సింగ్ మధ్యలో కుటీరంలాంటి ఆ పూరిల్లు... మొత్తం మీద ఋషులుండే పర్ణశాలలా ఉంది.

కారు ఆ చోట ఆగింది.

ఆ శబ్దానికి లోనుండి బయటకు తిరిగి చూసాడో యువకుడు.

కారు డోర్ తెరచుకుని కిందికి దిగిన వాసుదేవరావుని చూడడంతోనే ఆ యువకుని ముఖం విప్పారింది. అతడు చిరునవ్వుతో ముందుకెళ్లి ఆయనను ఆప్యాయంగా పలకరించాడు 'బాగున్నారా మామయ్య'.


ఆయన జవాబు చెప్పలేదు.

అతడదేమీ పట్టించుకోకుండా 'రండి మామయ్యా! కూర్చుందాం' అన్నాడు లాన్‌వేపు అడుగులేస్తూ. లాన్‌లోని కుర్చీలలో కూర్చున్నాక అడిగాడు 'అత్తయ్య, ప్రియాంక ఎలా ఉన్నారు?'

'వారిద్దరూ సంతోషంగానే ఉన్నారు. కాని దిగులుపడి ఉన్నవాడిని నేనేరా రమేష్'

అతడు ఆయన వంక అభిమానం, బాధ మిళితం చేసి చూసాడు.

'ఆశయానికి, ఆప్యాయతలకు మధ్య చిన్న ఘర్షణ... ఇలాంటి సమయంలో దుర్బలులు ఆప్యాయతకు, ఉత్తములు ఆశయానికి బద్ధులవుతుంటారు.



దిగులెందుకు మామయ్యా?' అని అడగాలనిపించింది. ఆ టాపిక్‌ని మరింత పొడిగించడం ఇష్టం లేకపోయింది.

ఆయన అడిగాడు 'చిన్నప్పటి నుండి సిటీలో బ్రతికిన నువ్వు ఇప్పుడు ఈ మారుమూల పల్లెలోను ఆనందంగా ఉండగలుగుతున్నావంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది'.

'ఆనంధం మనం సృష్టించుకోవాలి మామయ్యా! దాని కోసం వెతుకులాడుతూ వెళితే వ్యధ మాత్రమే మిగులుతుంది'.

ఆ క్షణం ప్రియాంక ఆయన కళ్లముందు కదలాడింది ' ఆ పల్లెల్లో వాళ్లెలా బ్రతుకుతారో నాకర్థం కావటంలేదు. ఒక సినిమా హాలు, ఒక పార్క్, షాపింగ్ సెంటర్- ఏవీ ఉండవు. ఎంజాయ్ చేసేందుకు ఏమీలేని ఆ పల్లెటూళ్లలో ఉండటం నా వల్లకాదు. అంతకన్నా ముఖ్యంగా- శుచీ శుభ్రత, చదువు, సంస్కారం లేని పల్లెటూరి మొద్దులకు ఉచిత సేవ చేయడానికి కాదు నేను ఎంబిబిఎస్ చదివింది. సిటీలో నర్సింగ్‌హోమ్ పెట్టి రెండు చేతులా డబ్బు సంపాదించాలన్నదే నా ఆశ, ఆశయం'.

ఆయన చిన్నగా నిట్టూర్చాడు 'పొంతనలేని ఆశ ఆశయాలు- మేనల్లుడికి, కన్నకూతురిని దూరంగా ఉంచాయి. ఒకరితో ఒకరు ఏ విధంగాను సర్దుకుపోలేని భిన్నధృవాలు వీరు... కాని తన ప్రయత్నం తాను చేయాలి కదా?'

'లేవండి మామయ్యా! స్నానం చేయండి' రమేష్ పైకిలేస్తూ అన్నాడు.

నౌఖరు స్నానానికి నీళ్లు పెట్టాడు. ఆయన స్నానం ముగించాడు.

ఆ రాత్రి భోజనాల ముందు- ఆయన తనొచ్చిన కార్యం సఫలం చేసుకునే ప్రయత్నం చేసాడు. అందుకే అన్నాడు 'చనిపోయిన మీ అమ్మ, బ్రతికున్న నేను కోరుకున్నది, కోరుకుంటున్నది ఒక్కటే- మీరిద్దరు దంపతులు కావాలని...'

ఆయన మాటలు మధ్యలోనే కట్ చేసాడు రమేష్. 'పవిత్ర ఆశయానికి కోరికల కోరికల గురించి తెలుసుకోవడం లేదు' ఆయనకు కాస్త విసుగనిపించింది. అప్పుడే భోజనమూ పూర్తయింది.

'ఉద్రేకాలెక్కిన వారికి పొత్తుకుదరడం చాలా కష్టం మామయ్యా'... ప్రియాంక ఆశలు నాకు తెలుసు. ఆమెకు ఆస్తి, అంతస్తు, హోదా, సుఖాలు కావాలి. మరి నేను కోరుకునేది?... ఆ కృత్రిమ సుఖాలు కాదు. నాకు డబ్బు విలువకన్నా జీవితం విలువ తెలుసు. ఒక డాక్టర్‌గా నేను ఎంతో మందికి ఉపయోగపడగలనని నాకు తెలుసు. అయితే నగరాలలోకన్నా, ఈ పల్లెవాసులకే నా అవసరం ఎంతో ఉంది. ఆ నగరాలలో డబ్బున్నవారి ముంగిట్లో నిలబడి వారి పిలుపు కోసం వేచి ఉండే వైద్య శిఖామణులు ఎందరో ఉన్నారు. కాని దేశానికి అన్నదాతలైన మన పల్లెజనం సరైన వైద్య సౌకర్యం అందక, ఒక్కో సమయంలో ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి వారికి సేవ చేయడంలోనే నాకు అపరిమితానందం దొరుకుతుంది. దయచేసి నా - మార్గాన్ని మళ్లించాలని ప్రయత్నించకండి'.

'వీడికి లక్ష్యాలే తప్ప, పెద్దల మనసులోని

ఇద్దరు చేతులు కడుక్కుంటుండగా వినిపించిందా కలకలం. రమేష్ వడివడిగా ఇంటి ముందుకొచ్చి నిలబడ్డాడు.

ఫెన్సింగ్‌గేటు తీసుకుని నలుగురు వ్యక్తులు, ఒక మనిషిని మోసుకొస్తున్నారు. ఆ మనిషికి తల పగిలి ఉంది. రక్తం వెల్లువలా కారుతోంది.

'ఏమయింది?' ఆతృతగా అడిగాడు రమేష్

కాస్త చదువుకున్నవాడిలా కనిపిస్తున్న ఓ యువకుడు చెప్పాడు.

'ఈగ్రామంలోని కక్షలు, కార్పణ్యాల సంగతి మీకు తెలియనిదేముంది డాక్టరు బాబూ! పెద్దిరెడ్డికీ, వెంకట్రాయుడుకి మధ్య గొడవల్లో- ఊళ్లో నెత్తురు ప్రవాహంలా సాగిపోతుంది... ఈరోజు ఏదో పొలం గట్టుకాడ గొడవల్లో వెంకట్రాయుడి మనుషులు వీడి తలపగులగొట్టారు...'

రమేష్ ఆ వ్యక్తిని పరీక్షించి చూసాడు 'త్వరగా ఇతడిని లోపలికి తీసుకురండి'

అందరితోపాటు వాసుదేవరావు లోపలికి వెళ్లాడు. ఆయన కూడా డాక్టర్. పేషెంట్ పరిస్థితి చూడగానే ఆ కేస్ సీరియస్ అని అర్థమైపోయింది. తమ హాస్పిటల్‌లో అయితే ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో చేర్చి వేల రూపాయలు ఖర్చు పెట్టిస్తారు.

రమేష్ ఉన్న కొద్ది ఎక్విప్‌మెంట్‌తోనే ఉన్న మందులతోనే పేషెంట్ పరిస్థితిని కంట్రోల్ చేసాడు. అప్పుడనిపించింది ఆయనకు- డాక్టర్‌కు కావలసింది అత్యాధునికమైన ఎక్విప్‌మెంట్ కాదు, ఇతరులకు సహాయపడాలనుకునే సేవా ధర్మం. ఆ భావం ఉన్నవాడు ఎలాంటి పరికరాలు అవసరం అంతగా ఉండదు అన్నది వాస్తవం. అంతేకాదు- ఆయన ఎక్కడో చదివాడు కొటేషన్ 'ఎ గుడ్ డాక్టర్‌మస్ట్ హేవ్ ఎన్ ఏంజిల్ ఐ, ఎ లైన్స్ హార్ట్ అండ్ ఎ లేడీ హేండ్స్'.... రమేష్ ఓ 'గుడ్‌డాక్టర్' అన్నదాంట్లో ఎలాంటి అనుమానం లేదు. ఇలాంటి వాడు సిటీలో ఉంటే అతి కొద్ది కాలంలోనే ప్రముఖ డాక్టర్ అయిపోతాడు.

పేషెంట్ దగ్గర ఇక తన అవసరం లేదనుకున్నాక, రమేష్ ఇవతలికొచ్చి కుర్చీలో కూర్చుని తల వెనక్కు వాల్చి కళ్లు మూసుకున్నాడు. వాసుదేవరావు అతడి ప్రక్కనే చాలాసేపు నిలబడ్డాడు. అతడు ఎంతకీ కళ్లు తెరవక పోయేసరికి భుజంమీద మెల్లగా చెయ్యివేసాడు.

రమేష్ కళ్లు విప్పి ఆయనకేసి చూసాడు.

'ఏంటి ఆలోచిస్తున్నావ్?'

'ఈ పల్లె జనం కష్టాల గురించి'

'ఏం జరుగుతోంది ఇక్కడ?'

'తమ స్వార్థంతో, తామొక చిన్న రాజ్యాన్ని సృష్టించుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత, భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారిద్దరు నాయకులు.. వారి ఘర్షణ చూస్తుంటే నాకు నవ్వొస్తుంది- ఒక జ్ఞానీ, తాత్వికుడు అన్నట్టు-

'అసలే ఈ మనుష్యులు దుర్బలులు<br>
వారిలో చచ్చేటన్ని చీలికలా?<br>
అసలే ఈ లోకం ఇరుకు<br>
అందులో ఇన్నిన్ని రాజ్యాలా?...

రమేష్ బలంగా నిట్టూర్చాడు 'లేదు.. దారుణాన్ని ఆపాలి.. అందుకు నాప్రయత్నం నేను చేస్తాను ఎప్పుడో కాదు, ఇప్పుడే...'

రమేష్ పేషెంట్ దగ్గరున్న చదువుకున్న కుర్రాడిని పిలిచి 'పెద్దిరెడ్డిని వెంకట్రాయుడుని తాను పిలుస్తున్నట్టు చెప్పి రమ్మన్నాడు. ఆ కుర్రాడు రమేష్‌వైపు విభ్రాంతిగా చూసాడు. వాసుదేవరావులోను అలాంటి షాకే!

అతడిమీదున్న గౌరవమో లేక అతడు సృష్టించుకున్న విలువకు భయపడో తెలియదు అర్ధగంట తర్వాత పెద్దిరెడ్డి, వెంకట్రాయుడు అక్కడికి వచ్చారు. ప్రత్యర్థులిద్దరు ఒకరినొకరు రౌద్రంగా చూసుకున్నారు.' తామిద్దర్ని ఏక కాలంలో అక్కడికి రప్పించటంలో డాక్టర్‌గారి ఆంతర్యం ఏమిటోనని వారు రమేష్‌కేసి చూసారు.

రమేష్ చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులోని ఆప్యాయత వారిద్దర్ని వివశుల్ని చేసింది.

ఆకాశంలోనుండి వెన్నెల వెలుగు నేలకు జారుతోంది. చల్లగాలి ఉండుండి మెల్లగా వీస్తోంది. అతడు గొంతు సవరించుకున్నాడు.

'గ్రామ పెద్దలైన మీ ఇద్దరికీ నా నమస్కారాలు! మీ ఇద్దరినీ ఈ క్షణం నేనిక్కడకు ఎందుకు పిలిపించానో తెలుసా?...' అర నిముషం ఆగి పూర్తిచేసాడు అతడు... మీ ఇద్దరి మధ్యా శత్రుత్వం రూపుమాపి మిత్రులుగాచేయాలని...'

అతడి మాటలలో ఆవేదన, ఆర్తి, ఆర్ద్రత వారి మనసులను కదిలించివేసాయి.. ఎంతో కాలంగా పెంచుకుంటూ వస్తున్న వైరాన్ని ఒక్కసారిగా తుంచేందుకు వారి మనసులు ఒప్పుకోక పోవచ్చుగానీ- లోపలికి వస్తున్నప్పుడు ఒకరినొకరు క్రూరంగా చూసుకున్న ఆ ఇద్దరు ప్రస్తుతం నిర్మలమైన చూపులతో వీక్షించుకుంటున్నారు.

ఆ రాత్రికి ఊరంతా ఈ విషయం పాకింది 'పెద్దిరెడ్డి, వెంకటరాయుడు స్నేహితులయ్యారు'.

★★★

తూర్పు దిక్కునుండి సూర్యుడు పైపైకి ఎగబ్రాకుతున్నాడు. గత రాత్రి పచ్చికమీద వాలిన మంచుముత్యాలు మెల్లగా భూమి తల్లి ఒడిలోనికి జారుకుంటున్నాయి.

'మరొక్కరోజు ఉండి వెళ్లకూడదా మామయ్యా' కారెక్కబోతున్న వాసుదేవరావుతో అన్నాడు రమేష్.

'వెళ్లాలి... మరెప్పుడైనా వస్తాను. అప్పుడు పదిరోజులుంటాను'

ఆయన కారెక్కాక రమేష్‌డోర్ మీద ఒరిగి ఆయనతో నవ్వుతూ అన్నాడు.

'రాత్రి ప్రియాంక విషయంలో నన్ను మరింత వత్తిడి చేస్తారనుకున్నాను'

'చేయను... మా ఆనందాల కోసం, జరుగుతున్న ఓ మంచి కార్యాన్ని భగ్నంచేయను'.

'మీరేమంటున్నారో అర్థం కావడం లేదు'

ఆయన చెప్పాడు-

'వారసత్వంతోనే మానవుడు<br>
వరణీయుడు కాదు<br>
నరహంతకుల వంశంలో<br>
పురుషోత్తములెందరు లేరు? -<br>
అంటాడు ఒకకవి.

అలాంటి పురుషోత్తములు 'సమాజాన్ని సంఘటితం చేసి లోక కళ్యాణాన్ని సాధించే రోజు ఎప్పుడొస్తుందోనని మేధావులు ఎదురు చూస్తున్న రోజులివి.

కాని- పురుషోత్తములు కావలసిన యువకులు నేడు కులం, మతం, వర్గం, డబ్బు, అధికారాలకు అమ్ముడుపోతూ క్షతగాత్రభారత మాతను మరచిపోతున్నారు.

నువ్వు పల్లెకు బయలుదేరినప్పుడు నీది అమాయకత్వం అనుకున్నాను. ప్రియాంకను కాదనడం మూర్ఖత్వం అని తలిచాను. కాని రాత్రి తాలూకు సంఘటన నా కళ్లు తెరిపించింది. వ్యామోహాలకు లొంగని యువకుల వలన ఈ దేశానికి ఎంత మేలు జరుగుతుందో నా కర్థమయింది.

స్వేచ్ఛా వైజయంతికలు ధరించిన<br>
భారతీయ యువకుడు<br>
రత్నఖచిత స్వాతంత్ర్య ఖడ్గం ధరించిన<br>
మాతృదేశ రక్షకుడు

- అని స్వర్గీయ 'మఖ్దూం మొహియుద్దీన్' వర్ణించినయువకుడు- నా మేనల్లుడు పురుషోత్తముడై ఈ దేశ ప్రగతికిపాటు పడుతుంటే నాకెంతో ఆనందంగా ఉంది. ఈ మాతృ దేశ సేవాకార్యంలో నా కూతురు కూడా పాలు పంచుకోలేకపోతుందే అని బాధగా వుంది.

ఏదేమైనా నేనిప్పుడు నీ ఆశయాలను అభినందిస్తున్నాను. నీ ఆదర్శాలను వదులుకోమని ఎట్టిపరిస్థితుల్లోను చెప్పను... విష్ యూ బెస్టాఫ్‌లక్...'

కారు ముందుకు కదిలి సాగిపోయింది.

★★★